# రైలులో

సామాను రైలుపెట్టెలో పడేసి, ఒకమాటు పెట్టంతా కలయచూశాను, జనసమ్మర్దంవల్ల పెట్టె కిటకిట లాడుతున్నది. కొందరు పెట్టెలోకి తమ సామానులతోసహా వీరావేశంతో చొచ్చుకొస్తున్నారు. మరికొందరు సామానులుసర్ది, హడావుడిగా దిగిపోతున్నారు. "మన సామానంతా జాగ్రత్తగా వచ్చినట్టేనా?" అని అడిగింది సరళ. తనవొళ్ళోవున్న చిన్నమ్మాయిని పక్కనవున్న మా ఆవిడకి అందిస్తూ—

'బజారుకువెడితే 'హాటో', 'పర్సో' మరిచిరావడం కద్దు. యిప్పుడీ సామానంతా జాగ్రత్తగా వచ్చినట్లు ఏమినమ్మకం?' అంది మాఆవిడ, నావేపు కొంటెగా చూస్తూ—

'ఎక్కడికివెళ్ళినా వస్తువుల సంగతి అటుంచి, మనుషుల్ని మాత్రం జాగ్రత్తగా చూసుకుంటాను. అందుకోసమే జీవితంలో నన్ను ఎందరో అనాలోచితంగా వెంబడించడం జరుగుతున్నది' అని అన్నాను నేను చప్పున నోరుజారి—

సరళ మాఆవిడ చెల్లెలు—

సరళ మొహం ఎర్రబారింది. మాఆవిడ చురచురా నన్ను చూసింది.

పెద్దపిల్లలిద్దరూ పోటీలుపడి, కిటికీలోంచి అవతలికి తొంగి చూస్తున్నారు—'నాలాంటి గతిమాలింది ఎవ్వరో మిమ్మల్ని అనుసరిస్తుంది కాని, తక్కినవాళ్ళకి ఏమిగతిపట్టిందండీ'? అంది మా ఆవిడ, సరళని అదృశ్యంనుంచి తప్పించడం అవసరమన్న ఉద్దేశ్యంతో—

నాపక్కన కూచునివున్న, యీడుతిరిగిన లావాటిఅతను, మౌనంగా మామాటలు వింటున్నాడు.

అప్పుడే పెట్టెలోకివచ్చిన ఒక పల్లెటూరివాడు చోటులేక దిక్కులు చూస్తున్నాడు. ఏవో చిల్లరవస్తువులు అమ్ముకునే ఒక తురకొాతను 'జిందా తిలస్మాత్' మందునిచూర్చి ఏకధాటిగా ఉపన్యసిస్తున్నాడు—చెవులు గింగురుమంటున్నాయి. కొంతసేపటికి రైలు నెమ్మదిగా కదిలింది—రైలు కదలడంతోనే పిల్లలు, తమతమ స్థానాల్లోవచ్చి కూర్చునారు.

భక్...భక్...భక్...భక్...భక్...భక్ భక్...

రైలు మహా వేగంగా పరుగెడుతున్నది—

సరళ పరధ్యాన్నంగా కిటికీలోంచి ఎక్కడో దూరంగా చూస్తున్నది. మా ఆవిడ చిన్నమ్మాయి కింది పెదిమదగ్గర గిలిగింతలుపెట్టి, అమాయకంగా అది నవ్వితే దాని నవ్వులో తన చిరునవ్వుని ఆప్యాయంగా కలుపుతున్నది. పిల్లలు తమకిచ్చిన బిస్కట్లు తింటూ, ఏవో కబుర్లు చెప్పుకుంటున్నారు—

పక్కనవున్న పెద్దమనిషీ 'ఎక్కడికి వెడుతున్నారని' అడిగాడు.

నేను వినీవిననట్లు మౌనం వహించాను—

జీవితమొక మహా ప్రయాణం-ఎక్కడికి వెడుతున్నామో మనకే తెలియదు, తెలుసుకుందామన్న ప్రయత్నం కూడా వుండదు—అయినా వెళ్లకతప్పదు—

జీవితం ఉద్దేశ్యరహితంగా, దానిదారిని అదివెడుతుంది...అంతే—ఇంతలోకే సికింద్రాబాదు వచ్చింది. పెట్టెలోంచి దిగిపొయ్యేవాళ్ళు చివరికి ఒకరైనా కనపడలేదు, ప్రజలు చీమలబారులాగా ఒకటేపనిగా పెట్టెలోకి ఎగబాకుతున్నారు—

ఉత్తర క్షణంలో మా పెట్టెలోకి ఒక్కఅమ్మాయివచ్చింది. 'చాలా అందమైన అమ్మాయి' అని అభిప్రాయపడుతే, ఒకవిధంగా అతిశయోక్తి దోషం చుట్టుకుంటుందేమోనని భయపడి, మొత్తం మీద 'అందమైన అమ్మాయి' అనే చివరకి విధిలేక తేల్చుకున్నాను—

ఆ అమ్మాయి చోటులేక, పెట్టెలో దిక్కులుచూడటం మొదలెట్టింది; సరళ పిల్లల్ని సర్ది, ఆమెకోసం కొద్దిగా చోటుచేసి, ఆమెని కూర్చోమ్మని ఆహ్వానించింది. ఆమె శంకిస్తూ ఒకమాటు నావేపుచూసి, చివరకి విధిలేక నిర్దేశితస్థలంలో వచ్చి కూర్చున్నది.

'ఎక్కడికి వెడుతారండి ?' సరళ ఆమె కూర్చోవడంతోనే—

'ఖమ్మం' అని ఆమె క్లుప్తంగా జవాబు చెప్పింది.

'ఒంటిగానే వెడుతున్నారా?' అంది సరళ ఆమె క్లుప్తమైన జవాబుకి సంతృప్తిపడక—

'ఔనని' తిరిగి సర్దేసింది, ఆ అపరిచిత.

సరళ విధిలేక మౌనం వహించింది.

భక్...భక్...రైలుకదిలింది.

'పూరికే కూర్చోవడం, నాకుచాలా కష్టంగా వుంది' అన్నది మావిడ.

'పోనీ పెట్టె అంతా గంతులు వెయ్యి' అన్నాను నేనుదొరికిన అవకాశాన్ని జారవిడవకండా—

సరళ అమాయకంగా చప్పున నవ్వేసింది.

పిల్లలు అర్థంకాక, ఒకరిమొహాలు ఒకరు చూసుకున్నారు.

'గంతులు వెయ్యడం నాకు చాతకాదు. పోనీ మీరన్నా వెయ్యండి! మేమంతా చూస్తాము; ప్రొద్దన్నా గడుస్తుంది' అంది మా ఆవిడ, తన ఓటమిని ఒప్పుకోవడం యిష్టంలేక—

'పోనీ నీబదులు సరళనైనా వెయ్యమను' అని అన్నానునేను. మాటని తిప్పికొడుతూ—

అపరిచిత మమ్మల్ని ఒకటేపనిగా చురచూరా చూస్తున్నది.

ఈసారి పిల్లలకి 'గంతులు' అర్థమైనాయి.

'నేను గంతులు వేస్తానా నాన్నా'! అంది మా పెద్దమ్మాయి కల్యాణి.

రెండవ అమ్మాయి సీత మారు మాటాడకండా లేచి సీటులో గంతులు వెయ్యడం మొదలెట్టింది___

కల్యాణి ఒకవేపు, సీత ఒకవేపు, వాళ్ళిద్దరిగంతుల్ని ఆపడంలో మా తలప్రాణాలు తోకకొచ్చాయి.

దాని పుణ్యమాఅని సుజ్జి పడుకొనివుంది. లేకపోతే అదికూడా తల్లి వొళ్ళోనే చక్కగా, తనవంతు గంతులు తానువేసేది!

పెట్టెలోనివాళ్ళు పిల్లల గంతుల్నీ, మా ఆరాటాన్ని పరికిస్తూ, మౌనంగా ఆనందిస్తున్నారు.

అపరిచిత పెదిమలపైన కూడాచిరునవ్వుతొలుకాడింది.

భక్, భక్ అని రైలురొద___

ఎదురుగా వున్న సీటులోని ఒక అతను, సన్నగా కూనిరాగాలు తీస్తున్నాడు.

పక్కనున్నయీడుతిరిగినమనిషి, తన సీటులో కునికిపాట్లు పడుతున్నాడు. సుజ్జిలేచింది. మిగిలిన తనవంతుగంతులు కేరింతలతో ఆరంభించింది. సుజ్జి వచ్చీ రానిమాటలూ, అందమైన గంతులు అపరిచితని, ఆకర్షించాయి.

'ఈముగ్గురూ మీ అమ్మాయిలేనా?' అనిఅడిగింది, ఆ అపరిచిత మా ఆవిడని___

ప్రయాణంలో ప్రయాణీకులు కొలది కాలంవరకు మాత్రమే మౌనం వహించగలుగుతారు. తరువాత ఈ మౌనం, సహజంగా దానంతట అది విడిపోతుంది.

అపరిచిత నెమ్మదిగా మాతో సంభాషణల్లోకి దిగింది___

'భక్ భక్' రైలు పరుగెడుతున్నది.

భోనగిర్...జనగామ... చివరకి కాజీపేట వచ్చింది___

'ఇక్కడమాత్రమే అన్నం దొరుకుతుంది. మళ్ళీ బెజవాడ వెళ్ళే వరకు అన్న మెక్కడా దొరకదని' కాజీపేటలో రైలు ఆగీ ఆగడం తోనే, కునికిపాట్ల పెద్దమనిషి చెప్పాడు.

అన్నంసంగతి చెవిని పడడంతోనే పెద్దపిల్లలిద్దరు 'ఆకలి' 'ఆకలి' అని ఒకటేగోల మొదలెట్టారు.

''టిఫిన్ క్యారియర్' తీసుకొని విధిలేక హొటల్లోకి వెళ్ళాను. హొటల్లోని పరిస్థితులు గమనించి, వంటయింట్లోకి చొచ్చుకొని వెళ్ళి, ఒకటే క్యారియర్ లో రెండు అన్నాలు. తీసుకొచ్చాను.

తిరిగి ఇంకొకసారి నీళ్ళకోసం మరచెంబుతో రైలుదిగి వెళ్ళాల్సి వచ్చింది. తిరిగివచ్చి 'ఇంకా పిల్లలకి అన్నం ఎందుకు పెట్టలేదని!' అడిగాను మా ఆవిడని—

'మీరుకూడా భోజనం చేస్తారేమోనని, ఆగానంది' మా ఆవిడ— ఆకలి వల్ల, కడుపు చురచురమంటున్నది. ఇంక బెట్టుచేసి లాభంలేదని తెలుసుకొని, సరళా నువ్వుకూడా భోజనంచేస్తావా?' అని అడిగాను—

సరళ ఒకమాటు మా ఆవిడవేపుచూసి, ఆమె కూడా సుముఖంగా వుండడం గమనించి, 'భోజనంచెయ్యంది ఎవ్వరు? అందరం భోజనం చేస్తాము' అంది, సమస్యని తేలికగా విడదీస్తూ—

టిఫిన్ క్యారియర్ మూతతీసి, ఆమూతలో అన్నంకలిపి అందరికీ చేతులో ఒకొకముద్ద పడవెయ్యమన్నాను మా ఆవిడని. విస్తళ్ళు మరిచి వచ్చిన సంగతి జ్ఞాపకమొచ్చి—

'నేను సుజికీ, పిల్లలకీ అన్నం పెట్టాలి. మీరే కలపండి,' అంది మాఆవిడ— అన్నంకలిపిపిల్లలచేతుల్లో మొదలురెండుముద్దలు వేసాను. వాళ్లు హడావుడిగాతినడ మారంభించారు. సరళకూడా చెయ్యిజాపింది. ఆమెకీ ఒకముద్ద పడేసాను. సరళపక్కనే, ఆ అపరిచిత కూర్చొనివుంది.

'మీరుకూడా భోజనం చేస్తారా?' అని అడిగాను—

ఆమెజవాబుచెప్పక మౌనం వహించింది.

మాఆవిడా, నేనూ, పిల్లలూ, సరళా, రైలు కదలకముందే భోజనాలు ప్రారంభించాము. భోజనాల అల్లరితో పెట్టెఅంతా గింగురు మంటున్నది.

ఒకవాయి కలుపుతే, అందరికి చివరకి ఒక్కొక్క ముద్దయినా రావడంలేదు. పిల్లలు, నేను ఇంకొకవరుసకలుపకముందే 'అన్నం' 'అన్నం' అని గోల పెడుతున్నారు.

'సరళా, మా ఆవిడ' కూడా ఇదేవరుసని ప్రారంభించారు.

మూడవ వాయి కలుపుతుండగా, నెమ్మదిగా రైలు కదిలింది.

'మీరుకూడా భోజనం చేస్తారా?' అని తిరిగి ఆ అపరిచితని అడిగాను.

'విస్తరైనా లేదు, ఎల్లాతింటుంది?' అంది సరళ—

'మీకు వేసినట్టే, చేతిలో చక్కగా ఒకటితరువాత ఒకముద్ద వేస్తానన్నాను', పిల్లలూ, సరళా, మా ఆవిడ నా ఎంగిలి తింటున్నారన్న జ్ఞానంకూడా లేకుండా—సరళ బలవంతంగా, ఆమెచెయ్యి నాముందుకు నెట్టింది.

నేనుకూడా అనాలోచితంగా, ఆమెచేతిలో ఒకముద్ద వడేసాను.

'భక్ భక్'—రైలు తిరిగి బయల్దేరింది.

పెట్టెలోవున్నవాళ్ళంతా మావేపు ఒకటేపనిగా వింతగా చూస్తున్నారు. పెట్టెలో నవనాగరికులు ఎవ్వరూ లేకపోవడం కొంత మేలేననిపించింది— ఆ అపరిచితురాలు మాతో, ఎంగిలి అనికూడా లక్ష్యం చేయకండా భోజనం చేస్తున్నది.

ఆ అపరిచిత రైలెక్కింది దారభ్యతా పులుకుపులుకున మావేపు చూడడం నేను గమనిస్తూనే వున్నాను. మొదటినించీ ఆమె మొహంలో నాకు ఏవో విషాద రేఖలు కనపడుతూనేవున్నాయి, కాని ఆమె మొహంలో

కథా నిలయం
736
శ్రీకాకుళం

ఆ విషాదరేఖలు ఏమిటో కనుక్కోవడానికి నాకు ఇంతవరకూ సరిఅయిన అవకాశం లభించలేదు.

'ఇంత చిన్నతనంలోకూడా మీరెంతో విషాదంగా కనపడుతున్నారన్నాను' నేను, దొరికిన అవకాశాన్ని వదులుకోలేక—

'నేను విచారంగా కనపడుతున్నానా? అబ్బే! బొత్తిగా లేదే,' అంది, ఆమే మన్మల్ని మభ్యపెడుతూ—

'మీరు...ఇప్పుడు విచారంగా వున్నారని నాఉద్దేశంకాదు. మీ జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒకగొప్ప విషాద సంఘటన జరిగి వుంటుంది. దాని ఛాయలు ఎల్లప్పుడూ మీ మొహంలో ముద్రితమై, కళ్ళకి కట్టినట్టు కనపడుతూనే వుంటాయి. బహుశా వాటిని మీరు గమనించి వుండడం జరుగక పోవచ్చు,' అని అన్నాను నేను సవివరంగా—

'నా జీవితంలో ఏలాటి విషాద సంఘటనలుకూడా జరుగలేదే!' అని, ఆమె చప్పున అన్నం తినడం మానేసింది.

ఆ తరువాత నాకుకూడా అన్నం సహించలేదు. పిల్లలకి కడుపు నిండినట్లువుంది. వాళ్ళుకూడా తినడం మానేసి, చేతులు కడుక్కోవడ మారంభించారు.

నేను తినడం మానేసేసరికి, మా ఆవిడా, సరళాకూడా మానేశారు.

ఎందుకో అధాటుపాటున అందరమూ మౌనం వహించాము—

'ఛక్ ఛక్' అని, విధీవిరామం లేకుండా, రైలు పరుగిడుతూనే వుంది.

'..........................'

వరంగల్ దాటాము—ఖమ్మంవచ్చేస్తున్నది.

'వచ్చే స్టేషన్‌లోనే మీరు దిగడంకదూ?' అంది సరళ ఆ అపరిచిత నుద్దేశించి—

'ఔనని', ఆమె మౌనం వహించింది.

అప్పట్లో ఆ అపరిచిత, నాకు మనలోకంలో వున్నట్లే కనపడలేదు. ఏదోదీర్ఘంగా ఆలోచిస్తున్నది.

ఖమ్మం వచ్చేసింది. రైలువేగం తగ్గింది. ప్లాట్‌ఫారం పైన జనం క్రిక్కిరిసివున్నారు. రైలు ప్లాట్‌ఫారం చేరుకోవడంతోనే, ఆ అపరిచిత కిటికీలోంచి తొంగిచూడడ మారంభించింది.

ఎవరోఒక ముసలాతను, ఆమెను గమనించి, మాపెట్టెవేపే, వొణుకుతున్న కాళ్ళతో చరాచరా నడిచివస్తున్నాడు.

అయినా, అతను పెట్టెనందుకోవడానికి కొంతకాలం పట్టింది.

'మీ నాన్నగారా ఆ వచ్చేది' అంది సరళ.

'కాదు, మాతాతగారంది', ఆ అపరిచిత —

ఆముసలాతను 'కూలీ' చేతపెట్టె, పరువు దింపించి, 'ఏమే తొందరగాదిగు, రైలుకదులుతుంది', అన్నాడు, తన వణుకుతున్న కంఠంతో

ఆమెకి చప్పున కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. మావాళ్లకి వెడుతున్నానని కూడా చెప్పడం మానేసి, సుజ్జిబుగ్గ ఆప్యాయంగా తడిమి, ఒకమారు నా వేపు బలవంతంగా చూడలేక చూడలేకచూసి, మారుమాటాడకండా పెట్టెదిగి వెళ్ళిపోయింది, ఆ అపరిచిత —

మా ఆవిడకీ, సరళకీ కత్తివేసినా మొహంలో నెత్తురుచుక్క లేదు.

అప్పట్లో నాకు ప్రపంచమంతా పిచ్చిగా కనబడింది.

మళ్ళీ 'భక్ భక్' మని రైలు కదిలింది.

'పాపం! ఆముసలాతను, ఆమెభర్త కామోలు', అంది మాఆవిడ, యింకా సందేహిస్తూనే—

'అందుకోసమే కామోలు, రైలు ఎక్కినప్పటినించీ ఆమె ఒకటే పనిగా మిమ్మల్నిద్దర్ని చూస్తున్నది', అందిసరళ క్లుప్తంగా.

'పిల్లలుకూడా లేరేమో? అందుకోసమే పిల్లల్నికూడా దగ్గరికి తీసుకున్నది', అంది మాఆవిడ జవాబుగా—

'వెళ్ళేటప్పుడు చెప్పిఅయినా వెళ్ళలేదు!' అంది సరళ విసుగ్గా—

'అతన్ని చూడటంతోనే, ఆమెకి గిర్రున కళ్ళల్లో నీళ్లుతిరిగాయి. చప్పున తన జీవితానికీ, మన జీవితానికీ వ్యత్యాసం కనపడింది. తీరా వెళ్లివస్తానని చెబితే, దుఃఖంఆగక, పూర్తిగా బైట పడుతానేమోనని భయపడి, సుజ్జి బుగ్గనిమిరి, అర్థాటున వెళ్లిపోయివుంటుంది' అంది మా ఆవిడ—

'భక్, భక్' మని రైలు పరుగెడుతున్నది—

కష్టసుఖాలు, నిమ్నోన్నతాలు, వెలుగునీడలు లేకండా మా జీవితాలు ఈవిధంగానే గడిచిపోతే, ఎంతోహాయిగా వుంటుందనిపించింది, నాకు అప్పట్లో...

'భక్ భక్' మని రైలు పరుగెడుతూనేవుంది.